ప్రజాశక్తి
మంగళవారం 21 మే 2024 | 5 | శ్రీ సత్యసాయి



పిడుగుపాటుకు కూలీ మృతి



మృతుడు చంద్రశేఖర్

ప్రజాశక్తి బత్తలపల్లి

పొలం వద్దకు వెళ్లిన కూలీ ఇంటికి వెళ్లే క్రమంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన జింకా చంద్రశేఖర్(55) ఉప్పర్లపల్లి-గరికలపల్లి గ్రామాల సమీపాన గల సుధీర్ అనే రైతు పొలంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం పొలంవద్ద ఉండగా వర్షం ప్రారంభం కావడంతో ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. ఇంతలో ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం అధికం కావడంతో సమీపాన కోళ్లఫారం వద్ద ఉన్న రైతుల వద్దకు చేరుకునేందుకు అక్కడికి వెళ్లే క్రమంలో పిడుగు పడినట్లు పెద్ద శబ్దం వచ్చింది.దీంతో చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యాడు. దీంతో సమీపాన ఉన్న రైతులు చంద్రశేఖర్ వద్దకు వచ్చి నీరు తాగించే ప్రయత్నం చేశారు. అప్పటికే చంద్రశేఖర్ మృతిచెంది ఉన్నాడు. మృతునికి భార్య ప్రమీలమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాడిపత్రిలో హైటెన్షన్...

పోలీసుల మాక్‌డ్రిల్, ఫ్లాగ్‌మార్చ్

అదనపు బలగాల కవాతు

అజ్ఞాతంలోకి మండల నాయకులు





తాడిపత్రి పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, అదనపు బలగాలు

ప్రజాశక్తి - అనంతపురం

తాడిపత్రిలో సోమవారం హైటెన్షన్ నెలకొంది. పోలీసులు, ప్రత్యేక బలగాలతో పట్టణం నిండిపోయింది. తెల్లవారుజాము నుంచి మాక్‌డ్రిల్, ఫ్లాగ్‌మార్చ్, కవాతు నిర్వహించారు. పట్టణంలో పోలీసు బలగాలు 24/7 అప్రమత్తంగా ఉంటున్నాయి. అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి,జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలతో తాడిపత్రిలో సోమవారం మాక్ డ్రిల్, ఫ్లాగ్ మార్చ్‌నిర్వహించారు. తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు పికెట్లు, మొబైల్ పార్టీల గస్తీలు, వెహికల్ చెకింగ్ ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఎపిఎస్‌పి, ఎఆర్ బలగాలను మొహరింపజేశారు. తాడిపత్రిలోని పలు ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాలు, కూడళ్లలో పోలీసు పికెట్లు, మొబైల్ పార్టీల గస్తీలు, వెహికల్ చెకింగ్‌లు నిర్వహించారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే ఏమేరకు అప్రమత్తంగా ఉంటూ నిర్దేశిత రెస్పాన్స్ టైంలో ఘటనా స్థలానికి వెళ్లి చర్యలు తీసుకోగలుగుతారో చెక్ చేయడానికి పోలీసు అధికారులు సోమవారం తాడిపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటలకు అలర్ట్‌నెస్ చెక్ చేయగా ఆయా విధుల్లో ఉన్న అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు తేలింది. అందరూ సకాలంలో చేరుకుని ఏ ఘటన జరిగినా వెంటనే సద్దుమణిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడైంది. అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకష్ణ, డీఎస్పీలు బి.శ్రీనివాసులు, జి.శివభాస్కర్ రెడ్డి, బివి శివారెడ్డి, యు.నరసింగప్ప, శ్రావణ్ కుమార్ నేతృత్వంలో కేంద్రసాయుధ బలగాలు, ఏపీఎస్పీ, ఏ.ఆర్ సాయుధ పోలీసు బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలో అశోక్ పిల్లర్ నుండి ప్రారంభమై క్రిటికల్ ప్రాంతాలైన బండామసీద్, చిన్న బజార్, కటికవీధి, సుంకులమ్మపాలెం, యల్లనూరు రోడ్డు సర్కిల్, పుట్లూరు రోడ్డు సర్కిల్ ల మీదుగా అర్బన్ పోలీసు స్టేషన్ వరకు ఈ కవాతు కొనసాగింది.

తాడిపత్రిలో అత్యధిక కేసులు

సిట్ నివేదికల్లో వెల్లడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లు అత్యధికం తాడిపత్రిలోనే ఉండటం గమనార్హం. ఈ మేరకు సిట్ ఇచ్చిన నివేదికలోని అంశాలను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. మే 13వ తేదీన పోలింగు రోజు రాష్ట్రంలో పలుచోట్ల పెద్దఎత్తున అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య అల్లర్ల పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. ఓటింగు రోజు ఉదయం స్వల్పంగా ప్రారంభమైన ఘర్షణ రానురాను తీవ్ర రూపం దాల్చింది. మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఇప్పటికే జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను, డిఎస్పీ గంగయ్యను సస్పెండ్ చేసింది. ఆపైన ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది. విచారణబృందం రెండు రోజుల పాటు తాడిపత్రిలో మకాం వేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. అటు అధికారులతోపాటు, క్షేత్ర స్థాయిలో బాధితులను విచారించింది. విచారించి జరిగిన పరిణామాలపై నివేదికను డిజిపికి అందజేసింది. ఆ నివేదికలో పేర్కొన్న ప్రకారం చూస్తే అత్యధిక మందిపై కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికమందిపై కేసులు ఇక్కడ ఉండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 33 కేసులు నమోదయితే తాడిపత్రిలోని ఒక పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఏడు కేసులు నమోదయ్యాయి. ఇందులో 728 మందిపై కేసులు నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1320 మందిపై కేసు నమోదు అయింది. ఇక్కడ ఒక్కటే 728 మందిపై కేసు నమోదయింది. ఇందులో ఇప్పటికి 396 మందిని గుర్తించారు. ఇంకా 332 మందిని గుర్తించాల్సి ఉంది. గుర్తించిన వారిలో 91 మందిని అరెస్టు చేశారు. ఇంకా 634 మందిని అరెస్టు చేయాల్సుంది. కేసులు నమోదయిన వారిలో అటు వైసిని, ఇటు టిడిపి నుంచి ఇద్దరు ముఖ్య నేతలున్నట్టు తెలుస్తోంది. వైసిపి నుంచి తాజా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయనకుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిలపైనా కేసు నమోదయింది. అదే విధంగా టిడిపి నుంచి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు జెసి.అస్మిత్‌రెడ్డిలపైనా కేసులు నమోదయినట్టు తెలుస్తోంది. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు మరింత లోతుగా దర్యాప్తు జరగాల్సి ఉందని సిట్‌బృందం నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక సమయంలోనూ మరిన్ని పేర్లు చేరుతాయా లేక ఇంతటితోనే కేసుల నమోదు పూర్తవుతుందా చూడాల్సి ఉంది.

తాడిపత్రి డీఎస్పీగా జనార్ధన్ నాయుడు

తాడిపత్రి డీఎస్పీగా జనార్ధన్ నాయుడు నియమితులయ్యారు. ఏలూరు సెబ్ అధికారిగా ఉన్న ఈయనను తాడిపత్రి డీఎస్పీగా నియమించారు. ముందున్న డీఎస్పీ గంగయ్య ఇటీవల సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జనార్ధన్‌నాయుడు నియమితులయ్యారు. ఇక సిఐ మురళీకృష్ణ స్థానంలో నాగేంద్ర ప్రసాద్‌ను నియమించారు. ఈయన ఇది వరకు విఆర్‌లో ఉండే వారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం తాడిపత్రికి వస్తున్నారన్న పుకారు షికారు చేసింది. అయితే ఆయన హైదరాబాదులోనే ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తాడిపత్రి ఘటనపై విచారణకు తాడిపత్రికి వచ్చిన సిట్ అధికారులు అన్ని కోణాల్లోనూ విచారణ చేసి సోమవారం ఉదయం వెళ్లిపోయారు. ఈకార్యక్రమంలో సిఐలు క్రాంతికుమార్, ధరణీకిశోర్, శివరాముడు, జనార్ధన్, వెంకటేష్ నాయక్, పలువురు ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



కేంద్రబలగాల బందోబస్తు

అజ్ఞాతంలోకి పుట్లూరు, యల్లనూరు నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

సార్వత్రిక ఎన్నికల వేళ తాడిపత్రిలో చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని వైసిపి, టిడిపి నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. తాడిపత్రిలో అల్లర్లు జరిగాయంటే ఎక్కువగా పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తల ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. ఇందుకు సంబంధించి గతంలో కూడా అనేకమార్లు గొడవలు జరిగి కేసులు నమోదవడంతోపాటు జైళ్లకు కూడా వెళ్లారు. ఈనేపథ్యంలోనే ఈనెల 13, 14వ తేదీల్లో తాడిపత్రిలో పెద్దారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి వర్గాల మధ్య రణరంగం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటికే 91 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఈ రెండు మండలాలకు చెందిన వారు కూడా ఉన్నారు. దీంతో మరి కొందరిని అరెస్టు చేస్తారన్న ఊహాగానాలు రావడంతో పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ ఊళ్లను వదిలి అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరిలో కొంతమంది శ్రీశైలం, తిరుపతి, తదితర దేవస్థానాలకు వెళ్లగా మరి కొందరు బెంగుళూరు, హైదరాబాద్, గోవా, నగరాలకు వెళ్లినట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జూన్ 4 న నిర్వహించే కౌంటింగ్ రోజు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లు గురించి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ కొండయ్య, పెనుకొండ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో పాటు రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6 వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకే నిర్వహించాలన్నారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు శాంతి భద్రతలపై మానిటరింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ సమయంలో రిటర్నింగ్ అధికారుల నిర్ణయమే తుది నిర్ణయంగా పరిగణించబడుతుందన్నారు. కౌంటింగ్‌కు సంబంధించిన వివరాలు పుస్తక రూపంలో ముద్రించడం జరిగిందని బాగా చదివి పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈనెల 24న కౌంటింగ్ ప్రక్రియ పై జిల్లాస్థాయిలో వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని ఇందులో జిల్లాలోని తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల డిప్యూటీ అధికారులు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల పోలింగ్‌లో అధికారులందరూ చక్కగా పనిచేశారని కౌంటింగ్ సమయంలో కూడా అదే విధంగా పనిచేయాలని కోరారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం ఈవీఎంలు, వివి ప్యాడ్స్ సక్రమంగా స్ట్రాంగ్ రూములలో చేర్చాలని ఆదేశించారు. కౌంటింగ్ రోజున వివిధ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూములు తెరవాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్ కు సంబంధించి ప్రత్యేక సిబ్బంది ఉండాలన్నారు. కౌంటింగ్ లో పాల్గొనే సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. ఈ సమావేశంలో పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, కదిరి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఆర్‌డిఒలు భాగ్యరేఖ, వెంకట శివ సాయి రెడ్డి, గౌరీ శంకర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో చేనేతకార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దవడుగూరు


అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలకేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలకేంద్రంలోని చేనేత కాలనీకి చెందిన కుళ్లాయప్ప (40) కుటుంబం ఇంటివద్దనే చేనేతమగ్గం నేస్తూ జీవనం సాగిస్తోంది. చేసిన అప్పులు తీర్చలేక, కుటుంబపోషణ భారమై మనోవేదనకు గురైన కుళ్లాయప్ప ఇంటిలో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుళ్లాయప్ప మృతిచెందాడు. కుళ్లాయప్పకు సుమారు రూ.4లక్షల మేరకు అప్పులు ఉన్నాయని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మృతునిని భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు మెయిన్‌లో...

శిథిలావస్థలో పశువైద్యశాల!

నెర్రెలు చీలిన గోడలు.. పెచ్చులు ఊడుతున్న పైకప్పు...

భయం నీడన సిబ్బంది విధులు



నెర్రెలు చీలిన గోడ, పెచ్చులూడిన పశువైద్యశాల పైకప్పు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

నంబులపూలకుంటలో పశువైద్యశాల నిర్మించి దాదాపు 70, 80 సంవత్సరాలు అవుతుంది. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదే పురాతన భవనం అని చెప్పవచ్చు. ఇతర శాఖల భవనాలు ఉన్నా వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించారు. కానీ ప్రభుత్వ వైద్యశాలకు మాత్రం మోక్షం రాలేదు. ఈ భవనం గోడలు ఎక్కడ చూసినా నెర్రెలు చీలడం, వర్షాకాలం వస్తే పూర్తిగా తడిసిపోవడం, పైకప్పు పెచ్చులు ఊడిపడడం జరుగుతోంది. దీనికి తోడు ఇరుకైన గదులు. అయినా పశువైద్యులు, సిబ్బంది భయం నీడం ఇందులోనే నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే పశువుల మందులు నిల్వ చేసిన గదులు తడిసిపోవడం, కారడం వల్ల మందులు పాడవుతాయని సిబ్బంది పేర్కొంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో మందులకు రక్షణగా పట్టలు కప్పుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు. వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాబోయేది వర్షాకాలం కావున ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చాలని సిబ్బంది కోరుతున్నారు.



ఇరుకు గదుల్లో నిల్వ ఉంచిన మందులు

నిధులున్నా కొత్త భవన నిర్మాణంపై నిర్లక్ష్యం

పశువైద్యశాల పాత భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణం చేపట్టేందుకు రెండేళ్ల క్రితమే సోలార్ పవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సిఎస్ఆర్ ఫండ్స్ కింద దాదాపు రూ. 20 లక్షలు మంజూర య్యాయి. ఆ నిధులు ఏమి చేశారనే విషయంపై ప్రభుత్వ అధికారులు కానీ సోలార్ కంపెనీ అధికారులు కానీ బయటకు తెలపడం లేదు.

'పంపిణీ' లెక్కల్లో మాయాజాలం



ప్రధాన పార్టీలను ముంచిన నాయకులు

ఆందోళనలో ఇరు పార్టీల అభ్యర్థులు

ప్రజాశక్తి-హిందూపురం

ఈసారి ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు రెండింటికీ ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు నిండా ముంచారన్న ఆందోళనలు నియోజక వర్గ వ్యాప్తంగా ఆయా పార్టీల నాయకుల్లో నెలకొన్నాయి. గతంలో ఏ ఎన్నికల్లోను లేని విధంగా ఈ సారి జరిగిన ఎన్నికల్లో రెండు పార్టీల్లోను నోట్ల కట్టల వరద పారింది. వైసిపి నాయకులు ఓటు రూ. 2వేల చొప్పున నియోజక వర్గంలో దాదాపు రూ.50 కోట్లు పంపిణీ చేయాలని ఆసమయంలో భావించినట్లు తెలిసింది. ఆ మేరకు వివిధ ప్రాంతాల నుంచి డబ్బులు సైతం దిగుమతి చేసుకున్నారు. అదే విధంగానే టిడిపి వారు సైతం పంపిణీ చేశారు. రెండు పార్టీల వారు ఆయా పంచాయతీ, వార్డు సర్పంచ్, కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్ ల ఆధ్వర్యంలో పంపిణీ చేయించారు. అయితే ఈ పంపిణీ పూర్తి స్థాయిలో చేయకుండా సగానికి పైగా ఆయా పంచాయతీ, వార్డు ప్రజా ప్రతినిధులు, నాయకులు మింగేశారన్న విమర్శలు ఆయా పార్టీల నాయకుల్లో బలంగా వినపిస్తున్నాయి. దీంతో పాటు ఒక పార్టీలో కీలక నాయకుడిగా కొనసాగుతూ ప్రత్యర్థి పార్టీకి సహకరించడం, కీలక సమాచారాన్ని చేరవేయడం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాయని తెలుస్తోంది. నియోజకవర్గంలో టిడిపి, వైసిపి అభ్యర్థులిద్దరూ ఇంటి దొంగల ముప్పు బారిన పడ్డారనే ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు రాజకీయాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వారున్న పార్టీ అభ్యర్థి విజయం కోసం చిత్తశుద్ధితో పని చేసేవారు. అయితే గత కొంత కాలంగా ఇంటి దొంగల చేతివాటం ప్రధాన రాజకీయ పార్టీలను వెంటాడుతోంది. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా కనిపెట్టలేడన్న చందంగా కొంతమంది నాయకులు కోవర్ట్ ఆపరేషన్లను అమలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బాలకృష్ణ, వైసిపి అభ్యర్థి దీపిక ఇంటి దొంగల బెడదను ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా టిడిపికి చెందిన కొంతమంది నాయకులు వైసిపితో కుమ్మక్కై సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి వారు పెద్ద ఎత్తున డబ్బులు అందుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ పరిధిలో ఉన్న మున్సిపాలిటీ, మూడు మండలాలకు చెందిన కొంతమంది నాయకులు కోవర్ట్ ఆపరేషన్ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే విధంగా వైసిపికి చెందిన కొంతమంది నాయకులు కూడా టిడిపికి లోపాయికారీ సహకారం అందించారనే చర్చ నడుస్తోంది. ఒకటి, రెండు మండలాలు, పట్టణానికి చెందిన నాయకులు టిడిపితో లాలూచీ పడినట్లు అధికారపార్టీ శ్రేణుల్లో గుసగుసలు మొదలయ్యాయి. పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు కోసం ప్రధాన అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఎక్కడ ఆధిక్యత వస్తుందనే అంచనాల్లో అభ్యర్థులు మునిగి తేలుతున్నారు. ఒకటికి రెండు సార్లు పార్టీ నాయకులు, కార్యకర్తల పనితీరు, ప్రవర్తనలను అంచనా వేసుకుని ఫలితం ఎలా వుండబోతుందని పోస్ట్ మార్టం జరుపుకుంటున్న కనిపిస్తోంది. ఈ దఫా ఎన్నికల్లో ఒక ప్రధాన పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు, నాయకులు పట్టణంలో సరిగ్గా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయలేదనిఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. దీనిపై ఆ పార్టీ అభ్యర్థి కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసి లబ్ధి పొందాలనే వ్యూహ, ప్రతివ్యూహాలతో టిడిపి, వైసిపి అభ్యర్థులు ఇద్దరూ ఆపరేషన్ ఆకర్ష్ నిర్వహించారనేది స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఈ వ్యవహారంలో ఎవరి ఆపరేషన్ సక్సెస్ అవుతుందో, ఎవరి వ్యూహం ఫలిస్తుందో ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం వారి గత అనుభవాన్ని బట్టి ఆ నష్టం ఏమేరకు వుంటుందనేది అంచనా వేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలు, గతంలో అవి అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజల విశ్వసనీయత కొంతవరకు ఓట్లు రాబడితే ఎత్తుకు పైఎత్తులు, వ్యూహ, ప్రతివ్యూహాల వల్ల కొంత మేలు జరుగుతుందని అభ్యర్థులు భావిస్తున్నారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులిద్దరూ కోవర్ట్ ఆపరేషన్లను ప్రోత్సహించారనేది బహిరంగ రహస్యం. అయితే ఆ ఆపరేషన్లు ఎవరి కొంప ముంచుతాయనేది తేలాలంటే జూన్ 4వరకు ఆగాల్సిందే.

ధర్మవరం గాయనికి గ్లోబల్ ఐకాన్ అవార్డు

ధర్మవరం టౌన్ : పట్టణానికి చెందిన గాయని సోమిశెట్టి సరళను గ్లోబల్ ఐకాన్ అవార్డు వరించింది. మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం ఫౌండేషన్ సభ్యులు పలువురికి గ్లోబల్ ఐకాన్ అవార్డులు ప్రదానం చేశారు. అందులో ధర్మవరం పట్టణానికి చెందిన గాయని, రచయిత సోమిశెట్టి సరళకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రామచంద్ర తేజావత్, ఐఆర్ఎస్ ఛైర్మన్ మామిడి భీమిరెడ్డి, ఎంపీ కృష్ణయ్య, ఎమ్మెల్యే పద్మారావు, తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ కృష్ణమోహన్, మంజునాథ ఫౌండేషన్ ఛైర్మన్ మంజులాగౌడ్ గ్లోబల్ ఐకాన్ అవార్డు అందజేశారు. ఆమెకు అవార్డు రావడం పట్ల పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.


సరళకు అవార్డు అందజేస్తున్న మంజునాథ ఫౌండేషన్ సభ్యులు

పెన్నహోబిలం చేరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

వజ్రకరూరు : ఉరవకొండ మండలం పెన్నోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు సోమవారం సాయంత్రం పెన్నోబిలం చేరాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా సంప్రదాయ ప్రకారం ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా గ్రామంలో పెన్నోబిలేసుని ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ విజయ్ కుమార్, అర్చకులు ద్వారకానాథ్, బాలాజీ స్వామి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వస్తివాచకం,రక్షాబంధనం, మత్స్య గ్రహణం, కలశ స్థాపన, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.


బ్రహ్మోత్సవాల సందర్భంగా పెన్నోబిలం ఆలయానికి చేరుకున్న నారసింహుడు

రైలు కింద పడి యువకుడు మృతి

తాడిపత్రి రూరల్ : రైలు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన రంగయ్య (30) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే ఉదయం పుట్లూరు రోడ్డు రైల్వేస్టేషన్‌లో రెండో ఫ్లాట్‌ఫారం నుంచి ఒకటో ఫ్లాట్ ఫారం వరకు వచ్చే సమయంలో సడెన్‌గా గూడ్స్ రైలు వచ్చి ఢీకొంది. వెంటనే ప్రయాణికులు కాపాడి అంబులెన్స్ ద్వారా తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు దేవాన్ష్ ఉన్నారు.

పేకాట జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని మర్రిమాకులపల్లి గ్రామ శివార్లలో పేకాట స్థావరంపై దాడి చేసి 12మందిని అరెస్టు చేసినట్లు కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మర్రిమాకులపల్లి శివార్లలో పేకాట ఆడుతున్నట్లు పక్కాగా అందిన సమాచారంతో దాడి చేసి 12 మందిని అరెస్టు చేసి, రూ.55,000 నగదు, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

29 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి మండల పరిధిలోని రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై విత్తన వేరుశెనగ అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి(ఏఓ) వి.లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆధార్‌కార్డ్, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ తీసుకెళ్లి సంబంధిత ఆర్‌బికె రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఇది వరకే లోతు దుక్కులు చేసుకున్న భూముల్లో విత్తన శుద్ధి చేసుకొని ఆఖరి దుక్కిలో పాస్ఫేట్, యూరియాతో పాటు జింక్ సల్ఫేట్, పొటాష్ ఎరువులను కలియదున్ని విత్తనం విత్తుకోవాలని సూచించారు. నెలాఖరు లోపు మండలంలోని అన్ని ఆర్‌బికెల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి 3,249 మంది రైతులకు 2,563 హెక్టార్లకు గానూ రూ. 4.26 కోట్లు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. జమ కాని రైతులు కొద్ది రోజులు వేచి చూసి ఆ తర్వాత సంబంధిత ఆర్‌బికె సంప్రదించాలని సూచించారు.

పేర్లు నమోదు చేసుకోండి : ఏవో

పుట్టపర్తి రూరల్ : ఖరీఫ్-2024కు సంబంధించి విత్తన వేరుశనగ అవసరమైన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం సోమవా రం ఓ ప్రకటనలో తెపారు. ఈ నెల 20వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ తీసుకెళ్లి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

గాండ్లపెంట : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ కోసం పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని ఏఓ లక్ష్మిప్రియ తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ అందజేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

రొద్దం : రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తన వేరుశనగ కోసం మండలంలోని రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ శంకర్‌నాయక్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే విత్తన కాయలు అందుతాయని స్పష్టం చేశారు. ఆయనతో పాటు ఎఇఒ అంజాద్, తదితరులు ఉన్నారు.

నల్లచెరువు : రాయితీ విత్తన వేరుశనగ కోసం మండలంలోని రైతులు ఈ నెల 20వ తేదీ నుంచి పేర్లు నమోదు చేయించుకోవాలని మండల ఏవో భారతి తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్ తీసుకెళ్లి గ్రామ సచివాలయంలో వివిఎ, విహెచ్ఎ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సోమందేపల్లి : ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందించే విత్తన వేరుశనగ కోసం మండలంలోని రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పెనుకొండ మండల వ్యవసాయ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న విత్తన వేరుశనగ రాగానే పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నల్లచెరువు : ఈ నెల 20వ తేదీ(సోమవారం) జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడం తో వాయిదా వేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల సభ్యులు సర్వసభ్య సమావేశానికి హాజరుకాలేకపోవడమే కారణమని తెలుస్తోంది.

జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ఘర్షణలు, అల్లర్లు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించారు. పుట్టపర్తి సబ్ డివిజన్ పుట్టపర్తి అర్బన్ సర్కిల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉదయం పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ పర్యవేక్షణలో సిఐలు కొండారెడ్డి, రాజా రమేష్, బుక్కపట్నం, నల్లమాడ, పుట్టపర్తి రూరల్ ఎస్ఐలు సురేష్‌బాబు, కృష్ణమూర్తి, సురేష్ పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అలాగే రౌడీ షీటర్స్, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. పాత నేరస్తుల నివాసాలను క్షుణంగా తనిఖీ చేశారు. గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, ప్రజలు గొడవలు, అల్లర్లకు వెళ్లకుండా ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకూ ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నాయని ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సిఐ కొండారెడ్డి హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బెట్టింగ్, పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండా లన్నారు. మద్యం అమ్మేవారి సమాచారం ఇవ్వాలని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ నగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్


హిందూపురం : అంబేద్కర్ నగర్‌లో విచారణ చేస్తున్న సిఐలు

గడ్డివామిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


హిందూపురం : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. అనుమానం ఉన్న ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా సోదాలు చేశారు. వన్, టూ టౌన్ సిఐలు శ్రీనివాస్, రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా కార్డన్ సెర్చ్ చేపట్టామన్నారు. తనిఖీల్లో ఎస్ఐలు, పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

4 వరకూ 144 సెక్షన్ : సిఐ

ముదిగుబ్బ : మండలంలోని పొడరాళ్లపల్లి, గరుగుతండా గ్రామాల్లో సోమవారం రూరల్ సిఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. వీరు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ వరకూ మండలంలో 144 సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎక్కడా జనం గుంపులుగా ఉండరాదని ఎవరూ ఎలాంటి అల్లర్లకు పాల్పడరాదన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్నం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కత్తివారిపల్లిలో పోలీసుల తనిఖీ

గాండ్లపెంట : మండలంలోని కత్తివారిపల్లి గ్రామంలో సోమవారం ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో అనుమా నిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలు ఘర్షణ పడకుండా ప్రశాంతంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కార్యక్రమంలో జమేదార్ పి.రామయ్య, సిబ్బంది భాస్కర్ రాజు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొదుపు సంఘాలు ఆర్థికంగా బలోపేతమవ్వాలి

డిఆర్‌డిఎ పిడి నరసయ్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని డిఆర్‌డిఎ పిడి కెవిఎన్.నరసయ్య వెలుగు సిబ్బందికి సూచించారు. స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి అధ్యక్షతన మోడల్ మండలాలైన బత్తలపల్లి, ముదిగుబ్బ, గాండ్లపెంట, ఓడి చెరువు, చెన్నేకొత్తపల్లి మండలాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పిడి నరసయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధనకు కృషి చేయాలన్నారు. సంఘాలు, వారి వార్షిక ఆదాయం ఎలా అభివృద్ధి చేసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. రుణాల రికవరీపై సమీక్షించిన అనంతరం ముదిగుబ్బ అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారు. వెంటనే పురోగతి సాధించాలని సూచించారు. అంతకుముందు స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల పనితీరుపై సమీక్షించారు. అన్ని మండలాలు ఆడిట్ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్(జీవనోపాదులు) రామ్మోహన్, ఫైనాన్స్ రామిరెడ్డి, హెచ్‌ఆర్, ఎపిఎం సుదర్శన్‌రాజు, ఐదు మండలాల ఎపిఎంలు, సీసీలు, అకౌంటెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై కానీ, క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి కానీ ఏ రూపంలోనైనా మండలంలో ఎక్కడైనా బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరిం చారు. ఎస్ఐ సోమవారం సిబ్బందితో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌కు పాల్పడి ఆర్థికంగా నష్టపోయి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబం అభివృద్ధికి, పిల్లల అభివృద్ధికి కష్టపడి పని చేసుకోవాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లకూడదన్నారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాలు పంచుకుంటే వారి భవిష్యత్తు నాశనమైపోతుందని, తద్వారా కుటుంబం బజారు పాలవుతుందన్నారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే ఆయా గ్రామాల్లోని ప్రజలు తమకు సమాచారం ఇస్తే ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హెల్మెట్ లేని ప్రయాణం ముప్పు

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే ప్రాణానికి ముప్పు అని ఎస్ఐ.శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపే వాహన చోదకులకు ఎస్ఐ హెల్మెట్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాణాల్లో తలకు బలమైన గాయాలై చనిపోతున్న సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఆదివారం నల్లబోయనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బీ.టెక్ విద్యార్థులు హెల్మెట్ పెట్టుకొని ఉంటే ప్రాణాపాయం తప్పేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

అడల్ట్ బిసిజిపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కోట్లపల్లి, రాచువారిపల్లి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ వ్యాక్సిన్ వల్ల క్షయ వ్యాధి రాదని, గత ఐదేళ్లలో టిబి వచ్చి తగ్గిపోయిన వారు, 60 ఏళ్లు నిండిన వారు, పొగ తాగేవారు, షుగర్ వ్యాధి ఉన్న వారు బిఎంఐ (శరీర ద్రవ్యరాశి సూచిక లేక ఎత్తుకు తగిన బరువు) 18 కంటే తక్కువ ఉండే వారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వారు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేసుకోవాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. ప్రతి ఫ్రైడే డ్రై డేగా పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలని అవగాహన కల్పించారు. దోమ పుట్టకూడదు-కుట్టకూడదు, చిన్నదోమ-పెను ప్రమాదం, అందుకోసం దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు దోమలకు ఆవాసాలు, వేపాకు పొగ దోమలకు సెగ అని నినాదాలు చేశారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, ఎస్ఎస్‌టి అబిద్, ఎంఎల్‌హెచ్‌పి విజయభాస్కర్, ఆరోగ్య కార్యకర్త రాధమ్మ, ఆశా కార్యకర్తలు రత్నమ్మ, సునంద పాల్గొన్నారు.


కోట్లపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : డా.స్వరూపరెడ్డి

పరిగి : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజల వ్యక్తిగత అలవాట్లు, సరైన ఆహారం, సమయపాలన పాటించేలా ప్రజలను చైతన్య పరచాలని వైద్యాధికారి డాక్టర్ స్వరూపరెడ్డి అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిల దైనందిన కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం ఆయన శాసనకోట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మరింత మెరుగ్గా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బంది అనురాధ, సుమయలకు సూచించారు. గ్రామంలోని వయోజనులకు బిసిజి టీకా ఆవశ్యకత గురించి వివరించాలని, మలేరియా, డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి వన్నప్పతో పాటు పలువురు ఉన్నారు.

పెట్రోల్ లూజుగా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకు నిర్వాహకులు పెట్రోల్, డీజిల్‌ను లూజ్ విక్రయాలు చేపట్టరాదని పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. దీంతో పాటు అన్ని పెట్రోల్ బంకుల వద్ద ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ ఆదేశాల మేరకు 2024 ఎన్నికల కోడ్ ముగిసే వరకూ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కేవలం వాహనాలకు మాత్రమే వేస్తామని, కంటైనర్లు, వాటర్ బాటిళ్లు, క్యాన్లకు లూజు పట్టడం జరగదని సూచిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎఎస్ఐ అక్బర్ పాల్గొన్నారు.

పుట్టపర్తి : కొత్తచెరువు మండల వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో విడిగా బాటిళ్లు, క్యాన్లలో పెట్రోట్, డీజిల్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ రాజారమేష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ పెట్రోల్ బంకుల యజమానులు ఈ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. పెట్రోల్ బంకుల వద్ద నిబంధనల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక ఈ నిబంధనలను పాటించాలని సిఐ సూచించారు.


హిందూపురం : పెట్రోల్ బంకు వద్ద ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న పోలీసులు

నేరాలు ఘోరాలు

పేకాటజూదరుల అరెస్టు.. రూ. 20వేలు స్వాధీనం

బత్తలపల్లి : మండలంలోని వెంకటగారిపల్లి సమీపంలో ని ఓ వ్యవసాయ తోట వద్ద పేకాట స్థావరంపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 20,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.శ్రీని వాసులు తెలిపారు. ఎస్ఐ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వెంకటగారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామని తెలిపారు. నలుగురు పేకాట జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 20.150తో పాటు 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వీరిని ధర్మవరం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే తాట తీస్తాం : డీఎస్పీ

కదిరి అర్బన్ : కదిరి సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, అతిక్రమిస్తే ఎవరైనా ఎంతటి వారైనా తాటతీస్తామని డీఎస్పీ శ్రీలత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ యాక్ట్ ప్రకారం ప్రజలు, రాజకీయపార్టీలు, ఇతర ఏ సంఘాలు ముందస్తు అనుమతి లేనిదే ఎటువంటి సభలు, సమావేశా లు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించకూడదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలపై గట్టి నిఘా పెడతామన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలందరూ శాంతియుతంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ జరిగినందుకు సహకరించిన అధికారులు, ప్రజలకు డీఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నా, అనుమానం వచ్చినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులు కావడంతో ఎవరైనా ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు.


డీఎస్పీ శ్రీలత

ఉపాధి పనులను తొందరగా ముగించండి : ఎపిఒ

బత్తలపల్లి : మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులను తొందరగానే ముగించుకుని ఇళ్లకు చేరోకోవాలని ఎపిఒ కుందానం ఆదెప్ప కూలీల కు సూచించారు. ఆయన సోమవారం మండలం లోని పోట్లమర్రి, బత్తలపల్లి, వేల్పుమడుగు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేయాలన్నారు. పనులకు హాజరైన వారి పేర్లు మాత్రమే మస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని పనులకు తొందరగా వచ్చి త్వరగా పూర్తి చేసుకుని ఎండ తీవ్రత పెరగకనే ఇంటికి చేరుకోవాలని సూచించారు. నీరు అధికంగా తీసుకుంటూ నీడకు ఉండాలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు నాగార్జునరెడ్డి, కమతం సూర్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ ఉన్నారు.

గృహ నిర్మాణ శాఖ ఓటిఎస్‌పై అవగాహన

ఓబుళదేవరచెరువు : మండల గృహ నిర్మాణ శాఖ ఓటిఎస్(వన్ టైం సెటిల్మెంట్)పై సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ వరలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ జాకీర్, ఇఒఆర్‌డి రాజశేఖర్, హౌసింగ్ ఎఇ నాగభూషణం పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా సచివాలయాల వారీగా ఎంతమంది ఓటిఎస్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమంది ఉన్నారు అనే వాటిపై పూర్తి వివరాలు అందించాలని సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బందిని ఎంపిడిఒ ఆదేశించారు. ఇందులో వీఆర్వోలు కూడా భాగస్వాములై ఓటిఎస్‌లను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ వరలక్ష్మి

ఓంకారేశ్వరునికి ప్రత్యేకపూజలు


బత్తలపల్లి : బత్తలపల్లిలో వెలసిన శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత శ్రీఓంకారేశ్వరుని దేవాలయంలో సోమవారం పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి వివిధ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆనంతరం స్వామిని పూలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి సోమవారం ఓంకారేశ్వరుడు వివిధ రూపాల్లో దర్శనమిస్తారని అర్చకులు వివరించారు.

చెరువులు కలుషితం కాకుండా చూడాలి

హిందూపురం : పట్టణంలో ఉన్న చెరువులను మురికి కుంపటి నుంచి కాపాడాలని పర్యావరణవేత్త భాస్కర్‌రెడ్డి కోరారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కొట్నూరు, సూరప్పకుంట, శ్రీకంఠాపురం చెరు వులు పూర్తిగా మురికి కుంపటిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ చెరువుల్లో మురుగు నీరు చేరడంతో అందులోని జలచరాలు చనిపోతున్నాయన్నారు. కొందరు అందులోని చేపలను పట్టి విక్రయిస్తున్నారని, వాటి వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. అంతేకాకుండా చెరువులోని నీరు దుర్గంధం వెదజల్లడంతో పుర ప్రజలకు కొత్త కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చెరువును కలుషితం కాకుండా చెరువులోకి మురుగు నీరు వెళ్లకుండా కాపాడాలన్నారు. లేని పక్షంలో ఈ విషయంపై చెరువులకు సంబంధించిన అన్ని ఛాయా చిత్రాలను తీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

నిరుపేద కుటుంబానికి ఉచిత గ్యాస్ కనెక్షన్

పుట్టపర్తి క్రైమ్ : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చి పుట్టపర్తిలో స్థిరపడిన ఓ నిరుపేద కుటుంబానికి సోమవారం పట్టణంలోని ఇండియన్ ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజీవ్‌దేవ్ తమ వంతు సాయమందించారు. రాజేష్‌యాదవ్, భవిత దంపతులు వికలాంగులైన ఇద్దరి పిల్లల ఆపరేషన్ కోసం రెండేళ్ల క్రితం పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చారు. అప్పటినుంచి ఇక్కడే చిన్న గదిలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి గ్యాస్ కనెక్షన్ లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజీవ్ దేవ్ ఆ కుటుంబానికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌తో పాటు గ్యాస్ సిలిండర్, స్టవ్ అందజేశారు.


గ్యాస్ స్టవ్ అందిస్తున్న ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజీవ్‌దేవ్

వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వినతి

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం సమీ పంలో జాతీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పాటైన కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమ వారం సిపిఎం నాయకులు పెద్దన్న ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయ అధికారులకు కాలనీ వాసు లు వినతి పత్రం అందజేశారు. పెద్దన్న మాట్లాడు తూ ఈ కాలనీలో నిరుపేదలు నూతనంగా గృహాలు నిర్మించుకున్నారని, ఇక్కడ దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారన్నారు. వీరంతా వ్యవసాయ కూలీలని తెలిపారు. కాలనీలో వీధి దీపాలు లేక రాత్రివేళ విష పురుగులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు కూడా వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగభూషణ, వెంకటలక్ష్మమ్మ, బాబా, అశ్వర్థమ్మ, లోకేష్, రామాంజినమ్మ, నంజుండప్ప పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నిరుపేదలు